# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**నవంబర్ 17, 2020**

## భారత విప్లవానికి, ప్రపంచ సోషలిస్టు విప్లవానికీ నిజమైన మిత్రుడు
## కామ్రేడ్ యాన్ మిర్దాల్‌కు రెడ్ సెల్యూట్స్!

భారత విప్లవానికి, ప్రపంచ పీడిత ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు, ప్రపంచ సోషలిస్టు విప్లవానికీ నిజమైన మిత్రుడు, ప్రముఖ రచయిత, మార్క్సిస్టు మేధావి కామ్రేడ్ యాన్ మిర్దాల్‌కు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ వినమ్రంగా విప్లవ శ్రద్ధాంజలి ఘటిస్తున్నది. యాన్ మిర్దాల్ కుటుంబానికి, బంధువులకూ సంతాపం తెలియజేస్తున్నది.

మిర్దాల్ మేధావుల కుటుంబంలో జన్మించాడు. సమాజ విజ్ఞానశాస్త్రజ్ఞుడు, ఆర్థికవేత్తా అయిన ఆయన తండ్రి గున్నార్ మిర్దాల్, భారతదేశానికి స్వీడన్ దేశ రాయబారిగా పని చేసిన తల్లి అల్వా రీమర్ ఆర్థిక, నిరాయుధీకరణ రంగాలలో నోబెల్ బహుమతులు అందుకున్నారు. తల్లిదండ్రుల ఉదారవాద బూర్జువా దృక్పథంతోను, వ్యక్తిగత విషయాలలోనూ విభేదించి యాన్ తన చిన్ననాటనే తన జీవితాన్ని తాను అనుకున్న విధంగా మలుచుకున్నాడు. ఐరోపా వలసవాద, సామ్రాజ్యవాద ప్రభావం పట్ల ధిక్కారాన్ని స్వీయచరిత్రాత్మక పుస్తకం 'కన్ఫెషన్స్ ఆఫ్ ఎ డిస్‌లాయల్ యూరోపియన్' (అవిధేయ యూరోపియన్ ఒప్పుకోలు) ద్వారా తెలియపరిచాడు.

తన కాలపు కార్మికవర్గ పోరాటాలను, జాతి విముక్తి పోరాటాలనూ పరిశీలించడమే కాకుండా యాన్ మిర్దాల్ వాటి పట్ల మార్క్సిస్టు దృక్పథాన్ని పెంపొందించుకున్నాడు. ఈ ఉద్యమాలను ఎత్తిపట్టాడు. మార్క్సిజాన్ని ఒక సిద్ధాంతంగా అధ్యయనం చేశాడు, దాన్ని ఆచరణకు మార్గదర్శిగా చూశాడు. మార్క్సిస్టు సిద్ధాంతం, ఆచరణా ప్రజలను దోపిడీ పీడనల నుంచి విముక్తం చేస్తుందని విశ్వసించాడు. ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న కార్మికవర్గ పోరాటాలతో మమేకమయ్యాడు. వివిధ దేశాలకు వెళ్లి అక్కడి విప్లవకారులను కలిసాడు. ఆ ఉద్యమాల గురించి రాశాడు. ఐరోపాకు, మూడో ప్రపంచ దేశాలకూ మధ్య సంబంధాల గురించి 'లాయల్ ఇమేజెస్' (విధేయ చిత్రాలు) పేరుతో ఒక పెద్ద వ్యాసం రాశాడు. ఇది ఆయన చేసిన ఒక ప్రముఖ రచన. 'మంత్లీ రివ్యూ' వంటి పత్రికలలో ఆయన వ్యాసాలు ఆ విప్లవాల అనుభవాలనే కాకుండా మిర్దాల్ కార్మికవర్గ స్ఫూర్తిని కూడా తెలియజేస్తాయి.

యాన్ మిర్దాల్ చాలా సార్లు భారతదేశానికి వచ్చాడు. దేశంలో గత, వర్తమాన విప్లవాలను అధ్యయనం చేశాడు. 1980లలో తెలంగాణా పోరాట ప్రాంతాలలో పర్యటించాడు. 'ఇండియా వెయిట్స్' (భారతదేశం ఎదురుచూస్తుంది) అన్న ఆయన వ్యాసంలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో జరుగుతున్న రైతాంగ పోరాటాల గురించి రాశాడు. దాదాపు ముప్పై సంవత్సరాల తరువాత 2010లో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నేతృత్వ కామ్రేడ్స్‌ను కలుసుకోవడానికి వచ్చాడు. ఆ తరువాత 'భారత్‌పై అరుణతార' పేరుతో ఒక అత్యంత ముఖ్యమైన, ఆలోచనాత్మకమైన, ప్రేరణాదాయకమైన పుస్తకం రచించాడు. భారత విప్లవోద్యమం గురించి, దండకారణ్యంలో బీజరూపంలో ఉన్న ప్రజల రాజకీయాధికారం గురించిన తన పరిశీలనలను ఈ పుస్తకంలో వివరించాడు. ఈ పుస్తకం అనేక భారత, ఐరోపా భాషలలో అనువాదమై, ప్రపంచవ్యాప్తంగా విప్లవ సానుభూతిపరులలో బహుళ ప్రచారం పొందింది. మా పార్టీ భావజాలం వివిధ దేశాల మావోయిస్టు పార్టీలకు పరిచయం కావడానికి ఈ పుస్తకం తోడ్పడింది.

యాన్ మిర్దాల్ మా వద్దకు వచ్చినప్పుడు, ప్రపంచ విప్లవాలపై ఆయన విస్తార అధ్యయనం నుంచి మేం చాలా విషయాలు నేర్చుకున్నాం. 'నేను ఎవ్వరికీ సలహాలు ఇవ్వను' అని ఆయన ఎంతో వినమ్రంగా చెప్పాడు. విప్లవాలు విజయవంతం అవుతాయని ఆయన దృఢంగా విశ్వసించాడు. 'ప్రజలు విప్లవం చేస్తారు. ప్రజలకు నాయకత్వం వహించే పార్టీ దేశ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా వ్యూహం, ఎత్తుగడలను నిర్ణయించుకుని విప్లవం చేయాలి. రష్యాలో జరిగిందిదే. చైనాలో జరిగిందిదే. మీరు కూడా అదే విధంగా చేయాలి' అన్నది మిర్దాల్ అవగాహన. 'ఒక రచయితగా ప్రజల న్యాయమైన పోరాటాలను వివరిస్తాను. భారతదేశంలోను, బయటా ఉన్న ప్రజలకు ఈ దేశంలో ప్రజలు ఎందుకు, ఏ రకంగా విప్లవం చేస్తున్నారో చెప్పడం నా ఉద్దేశ్యం' అన్నాడాయన.

ఈ పుస్తక రచన గురించి ఇలా అన్నాడు. 'పాలకులకు, పీడితులకు మధ్య ఘర్షణ వచ్చినప్పుడు పీడితుల పక్షమే సరైనదనే మాట చరిత్ర పొడవునా ఎంత నిజమో, 2010లో భారత్‌లో కూడా అంతే నిజం...దిక్కు మొక్కు లేని జనం ఒక్కొక్కరు అగ్నికణంగా మారుతున్న వేళ భారత్‌పై అరుణతార వెలుగుతోంది. ఆ వెలుగును చూసిన నా అనుభవాలు, ఆలోచనలు, ప్రాథమిక ప్రతిపాదనలు రాస్తున్నాను. అది నా విద్యుక్త ధర్మం'.

భారత విప్లవాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు అపారమైన కృషి చేసిన కామ్రేడ్ హరిశర్మ(1934-2010)కు యాన్ ఈ పుస్తకాన్ని అంకితం ఇచ్చాడు.

యాన్ మిర్డాల్‌ను ఈ పుస్తక ఆవిష్కరణ సభకు రాకుండా ఆపాలని భారత కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. ఆయన పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని చూసింది. ఆయన మీద ఒక తప్పుడు కేసు పెట్టాలని కూడా చూసింది. అయితే ఆయన తాను నమ్మినదానికి బలంగా కట్టుబడి ఉన్నాడు. ఈ దుష్ట చర్యలకన్నింటికీ తగిన జవాబు చెప్పాడు.

ఉపన్యాసాలకు, రచనలకూ పరిమితం కాలేదు యాన్ మిర్డాల్. రచయితగా ప్రజా పోరాటాలను ప్రచారం చేశాడు. భాకపా (మావోయిస్టు)ను అణచివేసి బహుళ జాతి కార్పొరేషన్‌లతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని చూసిన భారత పాలక వర్గాలు అమలు చేసిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ఖండించాడు. డబ్బు మీద గానీ కీర్తి మీద గానీ ఆయనకు మమకారం లేదు. ఈ విశ్వ ప్రసిద్ధ కార్మికవర్గ మేధావి ఒక సందర్భంలో తన ఆలోచనలను ఇలా బయటపెట్టాడు. 'నా పుస్తకాలు, పుస్తకాల మీద పారితోషికాలు, ఆస్తులు అన్నీ మా యువజన సంఘానికి ఇచ్చేశాను. ఇప్పుడు నాదంటూ చెప్పుకోగలిగిన ఏకైక ఆస్తి నేను పుట్టిన గ్రామంలో శ్మశాన వాటికలో నా కోసం కొని పెట్టుకున్న ఆరడుగుల నేల మాత్రమే'.

యాన్ మిర్డాల్ 30 పుస్తకాల వరకు రాశాడు. పదికి పైగా దేశాలలో పర్యటించాడు. వర్తమాన విప్లవోద్యమాలపై ఆయనకు గుండె నిండుగా ఆశ ఉన్నది. యౌవన కాలం నుంచి ప్రపంచ విప్లవాలను సమర్థిస్తూ మాట్లాడాడు, రాశాడు. భవిష్యత్తు సమసమాజాన్ని స్వప్నిస్తూ 93 సంవత్సరాల వయసులో మనకు దూరమయ్యాడు.

కామ్రేడ్ మిర్డాల్ మా కామ్రేడ్స్‌లో దాదాపు ప్రతి ఒక్కరితోనూ మాట్లాడాడు. 82 సంవత్సరాల వయసులో మమ్మల్ని కలవడానికి వచ్చినప్పుడు పీఎల్‌జీఏ కామ్రేడ్స్ ఆయన పట్ల ఎంతో శ్రద్ధ వహించారు. తన రోజువారీ పనులలో సహాయం చేసిన కామ్రేడ్స్ పట్ల అత్యంత కృతజ్ఞత వ్యక్తం చేసేవాడు. ఆ కామ్రేడ్స్ ఆయన తమ పట్ల చూపించిన వాత్సల్యాన్ని, శ్రద్ధనూ ప్రేమగా తలుచుకుంటారు. స్థానిక గోండ్ ఆదివాసులయిన పీఎల్‌జీఏ కామ్రేడ్స్‌తో తన సంభాషణలను ఆ పుస్తకంలో వివరించాడు. సమాజంలో, పార్టీలో, పీఎల్‌జీఏలో సాంస్కృతిక, మానవ సంబంధాలను నిశితంగా విశ్లేషించాడు.

ఫాసిజం ప్రపంచవ్యాప్త ధోరణిగా మారిన ఈ పరిస్థితిలో యాన్ మిర్డాల్ అస్తమయం వర్తమాన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు తీవ్రమైన నష్టం. ఆయన రచనలు, విశ్లేషణ, స్ఫూర్తి విప్లవ కార్యకర్తలకు, సానుభూతిపరులకూ ఎల్లప్పుడూ ప్రేరణనిస్తూ ఉంటాయి. సమాజాన్ని మార్చాలనుకునే వారికి, ముఖ్యంగా ప్రజానుకూల మేధావులకు ఆయన ఆలోచనలు, ఆచరణా ఆదర్శవంతమైనవి. దోపిడీదారుల పట్ల ద్వేషం, ప్రజల పట్ల ప్రేమా కలిగి ఉండి, మానవ సమాజ అభివృద్ధికి అద్వితీయ దోహదం చేసిన ఆయన స్ఫూర్తిని మనమంతా మనలో నింపుకుందాం. భారతదేశ, ప్రపంచ పీడిత ప్రజల విముక్తి కోసం యాన్ మిర్డాల్ చేసిన దోహదాన్ని మరింత ముందుకు తీసుకువెళదాం. ఆయన స్మరణలో సమస్త రకాల వేతన బానిసత్వానికి, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా, సోషలిజం-కమ్యూనిజం కోసం చివరి వరకు పోరాడతామని శపథం చేద్దాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**